'కెప్టెన్' కన్నుమూత

- డీఎండీకే అధినేత, నటుడు విజయకాంత్ మృతి
- అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- తమిళనాడు రాజకీయాల్లో చెరగని ముద్ర
- డీఎంకే, అన్నాడీఎంకేకు ప్రత్యామ్నాయానికి కృషి

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు, డీఎండీకే అధినేత విజయకాంత్ (71) కన్నుమూశారు. అనారోగ్యంతో చెన్నైలోని దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. విజయకాంత్ మృతి పట్ల ప్రధాని మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ తదితరులు సంతాపం తెలిపారు. విజయకాంత్ గత 4-5 ఏండ్ల నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. భార్య ప్రేమలతనే పార్టీ వ్యవహారాలు చూసుకుంటున్నారు.1991లో విజయకాంత్ నటించిన 'కెప్టెన్ ప్రభాకరన్' సినిమా హిట్ కావడంతో ఆయన్ను అభిమానులు 'కెప్టెన్'గా పిలుచుకుంటున్నారు. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు ప్రత్యామ్నాయ్యం తీసుకురావాలన్న ఉద్దేశంతో 2005లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. డీఎండీకేను స్థాపించారు. 2006 శాసనసభ ఎన్నికల్లో తన పార్టీ నుంచి తానొక్కడే గెలుపొందినా.. ఆయన పార్టీ 8.40 శాతం ఓట్లు సంపాదించింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీడీఎంకేతో పొత్తు పెట్టుకొని 29 స్థానాలు గెలిచారు. దీంతో డీఎండీకే రాష్ట్రంలో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచి విజయకాంత్ విపక్ష నేత అయ్యారు. 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ కూటమితో జట్టు కట్టారు. అయితే ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో విజయకాంత్ డిపాజిట్ కోల్పోయారు. తర్వాత పార్టీ ప్రభ క్రమంగా తగ్గుతూ వచ్చింది.

కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రముఖ తమిళ నటుడు, డీఎండీకే పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకాంత్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. నటుడిగా కళారంగానికి, రాజకీయ నాయకుడిగా ప్రజలకు విజయ్‌కాంత్ చేసిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. విజయకాంత్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మాజీ నేవీ అధికారుల మరణశిక్ష రద్దు

శిక్షను తగ్గించిన ఖతార్ అప్పిలేట్ కోర్టు

దోహా, డిసెంబర్ 28: గూఢచర్యం ఆరోపణల కేసులో ఖతార్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న 8 మంది భారత మాజీ నేవీ అధికారులకు భారీ ఊరట లభించింది. నిందితులందరికీ శిక్షను తగ్గిస్తూ అక్కడి అప్పిలేట్ కోర్టు తీర్పు వెలువరించిందని భారత విదేశాంగ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో బాధితుల కుటుంబాల్లో, ఖతార్‌లోని భారత దౌత్య అధికారుల్లో ఆనందం వ్యక్తమైంది. 'దోహా గ్లోబల్ టెక్నాలజీ'లో పనిచేస్తున్న భారత మాజీ నేవీ అధికారులను గూఢచర్యం, దేశద్రోహం ఆరోపణలపై 2022 ఆగస్టులో ఖతార్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ ఏడాది అక్టోబర్‌లో వారికి మరణశిక్ష విధిస్తూ ఆ దేశ కోర్టు తీర్పు వెలువరించటం సంచలనం రేపింది. తీర్పును సవాల్ చేస్తూ భారత అధికారులు గత నెలలో అప్పిలేట్ కోర్టును ఆశ్రయించారు. అప్పిలేట్ కోర్టు తీర్పునకు సంబంధించి పూర్తిపాఠం ఇంకా అందాల్సి ఉందని, ఆ తర్వాతే తదుపరి అడుగు ఏంటన్నది నిర్ణయిస్తామని భారత అధికారులు చెప్పారు.నేవీలో కెప్టెన్‌గా పనిచేసిన నవతేజ్ గిల్, మరో మాజీ కెప్టెన్ సౌరభ్ వశిష్ఠి, మాజీ కమాండర్లు పూర్ణేందు తివారీ, అమిత్ నాగ్‌పాల్, ఎస్‌కే గుప్తా, బీకే వర్మ, సుగుణాకర్ పాకాల, సైలర్ రాజేష్‌లను గూఢచర్యం కేసులో అరెస్ట్ చేశారు. మాజీ కెప్టెన్ నవతేజ్‌గిల్, నావల్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చదివినప్పుడు భారత రాష్ట్రపతి నుంచి గోల్డ్ మెడల్ అందుకున్నారు.

మణిపూర్ మంటలు.. పార్లమెంట్ సెగలు

- 2023లో దేశంలో కీలక పరిణామాలు
- జాతుల మధ్య వైరంతో రగిలిన ఈశాన్య రాష్ట్రం
- కొత్త పార్లమెంట్ భవనంలో భద్రతా వైఫల్యం

లోక్‌సభలో ఆగంతకులు రంగుల పొగను వెదజల్లడంతో గందరగోళం నెలకొన్న దృశ్యం(ఫైల్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: మరో రెండు రోజుల్లో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. 2023 ఏడాదికి వీడ్కోలు పలుకుతున్నాం. భారత్‌కు ఈ ఏడాది ఎన్నో తీపి.. చేదు జ్ఞాపకాల్ని మిగిల్చింది. ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఘర్షణలు, ఒడిశా ఘోర రైలు దుర్ఘటన, రెజ్లర్ల ఆందోళన.. వంటివి దేశ ప్రతిష్టను దెబ్బతీశాయి. ఈ ఏడాది చోటుచేసుకున్న కీలక పరిణామాలేంటో చూద్దాం..

మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణ

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత మే నెలలో చెలరేగిన ఘర్షణలు యావత్ దేశాన్ని కలవరపరిచాయి. మైతీలకు రిజర్వేషన్ల అంశంపై కుకీలు, మైతీల మధ్య చిచ్చు రేగింది. రెండు జాతుల మధ్య వైరం హింసాత్మకంగా మారింది. ఇద్దరు మహిళలను కొందరు వ్యక్తులు నగ్నంగా ఊరేగించిన ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. పార్లమెంట్‌ను కూడా ఈ అంశం కుదిపేసింది.

రాహుల్ సభ్యత్వం రద్దు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఈ ఏడాది పరువు నష్టం కేసులు వెంటాడాయి. ఎన్నికల ప్రచారంలో మోదీ ఇంటిపేరును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆయన మెడకు చుట్టుకున్నాయి. పరువునష్టం (క్రిమినల్) కేసులో సూరత్ కోర్టు రాహుల్‌గాంధీని దోషిగా తేల్చింది. రెండేండ్ల జైలు శిక్ష విధించింది. కోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సచివాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కేంద్రం తీరుపై కాంగ్రెస్ సహా మిగతా విపక్షాలు మండిపడ్డాయి. న్యాయం కోసం రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. దిగువ కోర్టు విధించిన రెండేండ్ల జైలు శిక్షను సుప్రీంకోర్టు నిలుపుదల చేయగా, ఐదు నెలల తర్వాత రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

కొత్త పార్లమెంట్ భవనంలో సమావేశాలు

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన భారత నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ద్రవిడ సాంప్రదాయానికి గుర్తుగా ఉన్న సెంగోల్‌ను స్పీకర్ కుర్చీ పక్కన ప్రతిష్టాపన చేశారు. అధునాతన సదుపాయాలు, సకల హంగులున్న కొత్త పార్లమెంట్ భవనం శీతాకాలం సమావేశాలతో అందుబాటులోకి వచ్చింది.

ఒడిశా రైలు దుర్ఘటన

ఒడిశాలోని బాలేశ్వర్‌లో జూన్ 2 రాత్రి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, ఓ గూడ్స్ రైలు, యశ్వంత్‌పూర్-హావ్‌డా ఎక్స్‌ప్రెస్ రైళ్లు అనూహ్యంగా ఢీకొనటం దేశమంతా విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో 296 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 1200 మంది గాయపడ్డారు. బోగీలు ఒకదానిపై మరొకటి దూసుకెళ్లటం, వాటి మధ్య ఛిద్రమైన శరీరాలు, క్షతగాత్రుల హాహాకారాలతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. ఘటనాస్థలానికి సమీపంలోని గ్రామ ప్రజలు చూపిన మానవత్వం అందర్నీ కదిలించింది. గాయపడ్డవారికి వందలాది మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

భారత్ అధ్యక్షతన జీ20 సమావేశాలు

న్యూఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన సెప్టెంబర్‌లో జీ-20 శిఖరాగ్ర సదస్సు జరిగింది. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు.. నినాదంతో సభ్యదేశాలతోపాటు, మిత్ర దేశాలు, అంతర్జాతీయ సంస్థలకు భారత్ ఆతిథ్యమిచ్చింది. 'ఢిల్లీ డిక్లేరేషన్'పై సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావటంలో భారత్ కీలక ప్రాత పోషించింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు దిగిన రష్యాకు భారత్ మద్దతుగా ఉండటంతో, సదస్సు నిర్వహణ సవాల్‌గా మారింది. ప్రతిష్టాత్మకమైన భారత్-మధ్య ఆసియా-తూర్పు ఐరోపా ఆర్థిక నడవా విషయంలో సదస్సులో అవగాహనా ఒప్పందం కుదిరింది.

ఆపరేషన్ టన్నెల్

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో సొరంగం పాక్షికంగా కుప్పకూలటంతో 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా అందర్నీ కలవరపాటుకు గురిచేసింది. లోపల చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకువచ్చేందుకు చేపట్టిన టన్నెల్ ఆపరేషన్‌కు అడుగడుగునా అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రతికూల వాతావరణం, సాంకేతిక సమస్యలను దాటి, 17 రోజులపాటు అలుపెరగక శ్రమించిన విపత్తు నిర్వహణ సిబ్బంది ప్రయత్నాలు ఫలించి కార్మికులంతా సురక్షితంగా బయటపడ్డారు. శిథిలాల తవ్వకంలో బాహుబలి లాంటి భారీ యంత్రం దెబ్బతినగా, కొద్ది మంది 'ర్యాట్ హోల్ మైనర్ల'తో చేపట్టిన తవ్వకం గమ్యాన్ని చేరుకుంది.

కొత్త పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం

శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు దుండగులు లోక్‌సభలోకి దూసుకొచ్చి.. రంగులు వెదజల్లుతూ, నినాదాలు చేయటం తీవ్ర కలకలం రేపింది. ఇదే సమయంలో పార్లమెంట్ బయట మరో ఇద్దరు దుండగులు అదే తరహాలో ఆందోళనలు చేశారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి వివరణ ఇవ్వాలంటూ విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ నిరసనలతో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పరుస్తున్నారని సభాపతులు మొత్తం 146 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ విధించటం చర్చనీయాంశమైంది.

ఇంకొన్ని..

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో విపక్ష పార్టీలన్నీ కలిసి 'ఇండియా కూటమి'గా ఏర్పడ్డాయి. అయితే లోక్‌సభ ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా భావించిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రెండు చోట్లా కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. స్వలింగ సంపర్కుల వివాహాలకు 'ప్రత్యేక వివాహాల చట్టం' కింద చట్టబద్ధత కల్పించేందుకు రాజ్యాంగ ధర్మాసనం నిరాకరించింది.

2023 రౌండప్- జాతీయం

రోడ్డెక్కిన రెజ్లర్లు

బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని మహిళా రెజ్లర్లు ఆరోపణలు చేయటం సంచలనం రేపింది. ఎంపీ బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫోగాట్ తదితర రెజ్లర్లు జనవరి నెలలో ఢిల్లీలో ఆందోళన చేపట్టారు. దీంతో యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్.. డబ్ల్యూఎఫ్ఐపై నిరవధికంగా సస్పెన్షన్ విధించింది. తమ నిరసనను కేంద్రం పట్టించుకోవటం లేదన్న ఆవేదనతో రెజ్లర్లు తమ అవార్డులను వెనక్కి ఇచ్చారు.

కాంగ్రెస్ పాలనలో విద్యార్థులే టాయిలెట్ క్లీనర్లు

కర్ణాటకలో దారుణ పరిస్థితి

శివమొగ్గ, డిసెంబర్ 28: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో విద్యార్థులతో మరుగుదొడ్లు కడిగించడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులతో ఇలాంటి పనులు ఎక్కువగా చేయిస్తున్నారని పలు దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులతో పనిచేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒక పక్క సీఎం సిద్ధరామయ్య హెచ్చరిస్తున్నా.. కర్ణాటకలో అలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా కొందరు విద్యార్థులు పాఠశాల మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప జిల్లా అయిన శివమొగ్గ, గుడ్డాల నేరాలకెరె గ్రామంలోని పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వీడియోలో ఇద్దరు విద్యార్థినులు పాఠశాల టాయిలెట్‌ను శుభ్రం చేయడం కన్పించింది. కర్ణాటకలో ఇది ఈ నెలలో మూడో ఘటన. స్కూల్ టీచర్లు విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించడాన్ని తల్లిదండ్రులు, పలు సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. మన టాయిలెట్లు మనమే శుభ్రం చేసుకుంటే డబ్బుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని ప్రిన్సిపాల్ విద్యార్థులతో చెప్పేవారని వారు ఆరోపించారు. దీనిపై అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు దళిత సంఘర్షణ సమితి తెలిపింది. కాగా సంఘటనలకు బాధ్యులుగా స్కూల్ ప్రిన్సిపాల్ శంకరప్పను సస్పెండ్ చేస్తున్నట్టు శివమొగ్గ డిప్యూటీ డైరెక్టర్ ఆప్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్ పరమేశ్వరప్ప ప్రకటించారు.

ముంబై నుంచి అయోధ్యకు కాలినడకన ముస్లిం యువతి

ముంబై: వచ్చే నెలలో అయోధ్యలోని రామజన్మభూమిలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులారా వీక్షించాలని దేశ, విదేశాల్లో కోట్లాది మంది ఎదురు చూస్తున్నారు. అటువంటివారిలో మహారాష్ట్రలోని ముంబైకి చెందిన షబ్నమ్ ఒకరు. ముస్లిం మతానికి చెందిన షబ్నమ్ శ్రీరాముని పట్ల అచంచలమైన భక్తి, విశ్వాసాలను ప్రదర్శిస్తున్నారు. శ్రీరాముడిని పూజించడానికి హిందువుగా ఉండాల్సిన అవసరం లేదని, మంచి మనిషిగా ఉండటమే ముఖ్యమని గట్టిగా చెప్తున్నారు. కాషాయ జెండాను ధరించి అయోధ్యకు పాదయాత్ర చేస్తున్నారు. రమణ్ రాజ్ శర్మ, వినీత్ పాండేలతో కలిసి ఆమె 1,425 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నారు.

అయోధ్య వెళ్దామా.. వద్దా?

- సందిగ్ధంలో విపక్ష ఇండియా కూటమి పార్టీలు
- బీజేపీ చెప్పినట్టు ఆడాల్సి వస్తుందేమోనని ఆలోచన

ఈ చిత్రంలో కనిపిస్తున్న గంట బరువు 600 కిలోలు. తమిళనాడులో తయారైన ఈ గంటను అయోధ్య రామాలయంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం తుది దశకు చేరుకొన్న నిర్మాణ పనులు పూర్తి కాగానే ఈ గంటను ఏర్పాటు చేస్తారు.

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠాపనకు హాజరవ్వాలా వద్దా అనే విషయంలో ప్రతిపక్ష ఇండియా కూటమిలో సందిగ్ధత నెలకొన్నది. కార్యక్రమానికి హాజరు కాకపోతే తమపై హిందూ-వ్యతిరేకులుగా ముద్ర పడుతుందేమోనని అవి భయపడుతున్నాయి. మరోపక్క హాజరైతే బీజేపీ చెప్పినట్టు ఆడాల్సి వస్తుందేమోనని ఆలోచిస్తున్నాయి. రామమందిర ప్రారంభోత్సవంపై కాంగ్రెస్ తీసుకొనే నిర్ణయం 2024 ఎన్నికలపై ప్రభావం చూపిస్తుందా అని కాంగ్రెస్ నేత శశిథరూర్‌ను మీడియా ప్రశ్నించినప్పుడు ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ సందిగ్ధతను స్పష్టం చేశాయి. 'మీరు వెళితే మీరు బీజేపీ చెప్పినట్టు వ్యవహరిస్తున్నారని అర్థం. మీరు వెళ్లకపోతే మీరు హిందు వ్యతిరేకులు. ఇది అర్థం లేనిది. వ్యక్తులను ఆహ్వానించారు. వ్యక్తిగతంగానే నిర్ణయం తీసుకోనివ్వండి. నేను గుడిని రాజకీయ వేదిక అనుకోను. రాజకీయ కార్యక్రమానికి వెళ్లకపోవడం మిమ్మల్ని హిందూ వ్యతిరేకిని చేయదు' అని గురువారం ఆయన వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఉమ్మడిగా ఒక నిర్ణయం తీసుకోవడం కష్టమని కూటమిలోని పార్టీలు భావిస్తున్నాయి. అయితే రామ మందిరం ఉద్యమంలో ముందు వరుసలో ఉన్న బీజేపీకి విపక్షాల నిర్ణయం వల్ల కొంత ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నది. మత విశ్వాసాలను రాజకీయికరణ చేశారణ విమర్శిస్తూ ప్రాణ ప్రతిష్ఠకు హాజరు కాలేనని సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి తెలిపారు. తృణమూల్ కాంగ్రెస్ కూడా ఇదే తరహా అభిప్రాయంతో ఉన్నా తన నిర్ణయాన్ని అధికారికంగా వెల్లడించలేదు. 'ఇవన్నీ రాజకీయాలు. బీజేపీ నిర్వహించే కార్యక్రమానికి హాజరవ్వాలని ఎవరు కోరుకుంటారు? ఇదేమీ జాతీయ కార్యక్రమం కాదు. బీజేపీ కార్యక్రమం అయ్యాక మేము అయోధ్యను సందర్శిస్తాం' అని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని ఇంకా ప్రకటించకపోయినా ఎన్నికల పరంగా ఎక్కువ నష్టం కలగకుండా ఉండేలా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. అయితే మందిరం ప్రారంభోత్సవానికి హాజరు కాకపోతే ఉత్తరాదిలో ఓట్లు రావేమోనని కాంగ్రెస్ ఆందోళన చెందుతున్నదని కేరళ జెమ్-ఇయ్యాతుల్ ఉలమా(సంస్థ) విమర్శించింది. అయితే మందిరం ప్రారంభోత్సవానికి హాజరవ్వాలా వద్దా అని నిర్ణయం తీసుకోవడం పార్టీలకు కానీ, వ్యక్తులకు కానీ అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రామ మందిరం రాజకీయ ఉద్యమంతో ముడిపడిన అంశం. దీనిపై పార్టీలు లేదా నాయకులు తీసుకొనే నిర్ణయాలను ఎన్నికల పరిణామాలతో కూడిన రాజకీయాల కోణంలో చూసే ప్రమాదం ఉందని చెప్తున్నారు.

ప్రారంభానికి ముస్తాబవుతున్న అయోధ్యలోని అంతర్జాతీయ విమానాశ్రయం

అయోధ్య విమానాశ్రయానికి వాల్మీకి పేరు!

రేపు జాతికి అంకితం చేయనున్న ప్రధాని

వారణాసి, డిసెంబర్ 28: అయోధ్యకు వచ్చే భక్తుల కోసం స్థానిక రామాలయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, మరిన్ని సౌకర్యాలతో పునరుద్ధరించిన అయోధ్య రైల్వే స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ఈ విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అయోధ్యధామం' అని పేరుపెట్టనున్నట్టు సమాచారం. ఇంతకు ముందు ఈ విమానాశ్రయాన్ని 'మర్యాద పురుషోత్తమ్ శ్రీరామ్ అయోధ్య అంతర్జాతీయ విమనాశ్రాయం'గా పిలిచేవారు. రూ.1450 కోట్లతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. 6,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టెర్మినల్ భవనాన్ని నిర్మించారు. 600 మంది ప్రయాణికులకు అనువుగా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది 10 లక్ష మంది దీని ద్వారా రాకపోకలు సాగిస్తారని భావిస్తున్నారు.

6 నుంచి రెగ్యులర్ విమానాల రాకపోకలు

ప్రారంభోత్సవం రోజున ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలు నడుపుతారు. రెగ్యులర్ విమానాలను జనవరి 6 నుంచి నడుపుతారు. ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్ నుంచి ఇక్కడకు నేరుగా విమాన సర్వీసులు ఏర్పాటు చేశారు. మరోవైపు అయోధ్య రామాలయం నుంచి 84 కిలోమీటర్ల పరిధిలో మద్యం అమ్మకాలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది.

ఒక్కరోజులో 702 కరోనా కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. బుధవారం నుంచి గురువారం నాటికి 24 గంటల్లో 702 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 4,097కు చేరింది. ఇదే సమయంలో వ్యాధి బారిన పడిన వారిలో తాజాగా ఆరుగురు మరణించారు.

ఈడీ చార్జిషీట్‌లో ప్రియాంక పేరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ పేరు తొలిసారి ఈడీ చార్జిషీట్‌కు ఎక్కింది. హర్యానాలోని ఓ గ్రామంలో ఐదెకరాల భూమి క్రయవిక్రయాల కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసిన ఈడీ అధికారులు అందులో ప్రియాంక పేరును చేర్చారు. ఆమె భర్త, ప్రముఖ వ్యాపారవేత్త ప్రియాంకవాద్రా పేరును కూడా అందులో చేర్చినప్పటికీ వీరిని నిందితులుగా మాత్రం పేర్కొనలేదు. ఎన్నారై వ్యాపారవేత్త సీసీ థంపి, భారత సంతతికి చెందిన బ్రిటిష్ జాతీయుడు సుమిత్ చద్దాపై దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో వీరి పేర్లను ఈడీ ప్రస్తావించింది.

శబరిమల ఆలయం మూసివేత

శబరిమల: కేరళలోని శబరిమల ఆలయాన్ని మూసివేశారు. బుధవారం మండల పూజ అనంతరం ఆలయ ద్వారాలకు తాళాలు వేశారు. మకర జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ తలుపులను ఈ నెల 30న తిరిగి తెరువనున్నారు. మండల పూజ ఉత్సవాలకు భారీగా అయ్యప్ప భక్తులు తరలివచ్చారు.

సీఐఎస్ఎఫ్ తొలి మహిళా చీఫ్‌గా నీనా సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు తొలి మహిళా చీఫ్‌గా నీనా సింగ్ నియమితులయ్యారు. వచ్చే ఏడాది జూలై 31 వరకు ఆమె ఈ పదవిలో ఉంటారు. 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన నీనాసింగ్ ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ స్పెషల్ డీజీగా పనిచేస్తున్నారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) డీజీగా దయాల్ సింగ్ నియమితులయ్యారు.

ఖాతాలను మూడేండ్లు వాడకుంటే

యూజర్ల డాటా తొలగించాల్సిందే

ఆన్‌లైన్ వేదికలకు కేంద్రం కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: యూజర్ల వ్యక్తిగత డాటా తొలగింపు, ఆన్‌లైన్ సేవలకు సంబంధించి కేంద్రం కీలక నిబంధనల్ని తీసుకురాబోతున్నది. యూజర్ల ఖాతాలు మూడేండ్లపాటు క్రియారహితంగా (ఇనాక్టివ్) ఉంటే, యూజర్ల వ్యక్తిగత డాటాను ఆన్‌లైన్ వేదికలు శాశ్వతంగా తొలగించే విధంగా నిబంధనలకు రూపకల్పన చేసింది. 18 ఏండ్లలోపు వారి విషయంలోనూ తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకున్నాకే, వారికి ఆన్‌లైన్ సేవలను వర్తింపజేయాలన్న నిబంధనను తీసుకువస్తున్నది. డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) యాక్ట్‌లో ఈ ముసాయిదా నిబంధనలను చేర్చింది. వీటిని ఇంకా విడుదల చేయాల్సి ఉన్నది. డీపీడీపీ చట్టానికి ఈ ఏడాది ఆగస్టులోనే పార్లమెంట్ ఆమోదం లభించినప్పటికీ పలు క్లాజులకు అదనపు నిబంధనలు జోడించారు. సంప్రదింపుల కోసం వీటిని త్వరలోనే విడుదల చేయనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో నోటిఫై చేయనున్నారు. సోషల్ మీడియా, ఈ-కామర్స్, ఆన్‌లైన్ గేమింగ్ తదితర సంస్థలకు ఈ నిబంధనలు వర్తించనున్నాయి. మరోవైపు, ఆన్‌లైన్ సేవలు పొందే ముందు పిల్లల వయసు ధ్రువీకరించుకోవడం తప్పనిసరి చేయనున్నది. 18 ఏండ్లలోపు వారికి.. వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్య సంరక్షణ, విద్యా సంస్థలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. వయసు ఆధారంగా ఆన్‌లైన్ సేవలకు అనుమతి ఇవ్వటమనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

99% క్యాన్సర్ కణాలు అంతం

కొత్త పద్ధతిని అభివృద్ధి చేసిన పరిశోధకులు



టెక్సాస్, డిసెంబర్ 28: అమైనోసియానైన్ అణువులను ఉపయోగించి క్యాన్సర్ కణాలను తొలగించే కొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ అణువులను సాధారణంగా బయో ఇమేజింగ్‌లో సింథటిక్ రంగులుగా వాడతారు. సైన్స్‌అలర్ట్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం ఈ అణువులను పరారుణ కాంతికి దగ్గరగా ఉద్దీపనం చేసినప్పుడు క్యాన్సర్ కణాలను విచ్ఛిన్నం చేసే సామర్థ్యాన్ని పొందుతాయి. రైస్ యూనివర్సిటీ కెమిస్ట్ జేమ్స్ టూర్ ప్రకారం మాలిక్యూలర్ జాకమర్స్‌గా పిలిచే ఈ అణువులు ఫెరింగా టైప్ మోటార్స్ అణువులతో పోలిస్తే పది లక్షల రెట్లు వేగంగా యాంత్రిక చలనంలో పనిచేస్తాయి. వీటిని పరారుణ కాంతికి దగ్గరగా ఉపయోగించడం వల్ల శరీరం లోపలికి వ్యాప్తి చెందుతాయి. ఎముకలు, అవయవాల క్యాన్సర్ చికిత్సలో శస్త్ర చికిత్సల అవసరాన్ని ఈ కొత్త పద్ధతి తగ్గిస్తుంది. ఈ కొత్త పద్ధతిని ఎలుకలపై ప్రయోగించినప్పుడు విజయవంతమైంది. అమైనోసియానిన్ అణువులు కదిలినప్పుడు అందులోని ఎలక్ట్రాన్లు ప్లాస్మాన్లను ఏర్పరుస్తాయి. ఈ ప్లాస్మాన్లు ప్రకంపనల ద్వారా క్యాన్సర్ కణాలను అంతం చేస్తాయి. అయితే ఈ ప్రయోగాలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

జర్నలిస్టులపై పెగాసస్ నిఘా

- కేంద్రప్రభుత్వ సంస్థల పనే
- బాధితుల్లో ఇద్దరు జర్నలిస్టులు
- ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటన
- మరోసారి దేశంలో పెగాసస్ కలకలం